www.kalamjyothi.com


# కలంజ్యోతి

రేపటి కోసం

మంగళవారం

29 ఏప్రిల్ 2025

## విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్థాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003

- ఎంత చెప్పినా పనితీరు మారడం లేదు
- పదవులు రాలేదని నోరు జారితో వాళ్లకే ప్రమాదం
- నోరు జాగ్రత్త.. ఇబ్బందిపడతారు
- రాష్ట్ర ఆర్థిక విధ్వంసానికి కేసీఆరే కారణం
- మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటు
- ఈ అంశంపై జానారెడ్డి, కేకే పార్టీలో చర్చిస్తారు
- మీడియాతో సీఎం చిట్ చాట్

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
తమ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలకు పొగరు పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎల్పీలో హెచ్చరించినా కొందరు తమ పనితీరును మార్చుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలామంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇది వారికీ, పార్టీకి మంచిది కాద న్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఇంకొందరు పార్టీలో అంత ర్గత విషయాలను బయట చర్చిస్తున్నారన్నారు. కొందరు పదవులు రాలేదని నోరుజారుతున్నారనీ ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారని చెప్పారు. అలాంటి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు తమ తీరు మా ర్చుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని అనుకుంటే అన్ని విధాలా నష్టపోతారని హెచ్చరించారు. సోమవారం కేశవరావుతో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి నివాసానికి సీఎం వెళ్లారు. అక్కడ కర్రెగుట్టపై కూంబింగ్ నిలుపుదలతో పాటు మావోయిస్టులతో చర్చలు జరపాలని ఈ నెల 27న తనను కలిసిన శాంతి కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలు, అపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణపై సీనియర్ నాయకులతో చర్చలు జరిపారు. తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. పార్టీ లైన్ దాటిన నేత ఎంతటివారైనా వారికి పార్టీ, ప్రభుత్వంలో ఎలాంటి పదవులు రావని తేల్చి చెప్పారు. భవిష్యత్తులోనే అవకాశాలు ఉండవని స్పష్టం శారు. పార్టీలో ఓపికతో ఉంటేనే పదవులు వరిస్తాయని చెప్పారు. . తనను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు

మిగతా 2లో



# మా ఎమ్మెల్యేలకు పొగరెక్కింది

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

---

బాధిత మహిళలకు అండగా

## జాతీయ కమిషన్

### జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహత్కార్

- హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలి
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం
- 30 కేసులకు పైగా పరిష్కారం

2లో



---

## కేసీఆర్ శకం ముగిసింది

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




4లో



# మా ఎమ్మెల్యేలకు పొగరెక్కింది

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదని అన్నారు. కొంత మంది అధికారుల పని తీరు బాగలేదని సీఎం చెప్పారు. అయినా అనివార్య కారణాలు, అవసరంతో వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు సర్వసాధారణమని చెప్పారు. పాలనా సౌలభ్యం కోసం అవసరమైన మార్పులు చేసుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

**మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ**

మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.ఈ అంశంపై పార్టీ సీనియర్ నేతలు జానారెడ్డి, కే. కేశవరావు పార్టీలో చర్చిస్తారని చెప్పారు. గతంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపిన అనుభవం వీరిద్దరికే ఉందన్నారు. ఇప్పుడు కూడ ఆ వ్యవహారం అంతా జానారెడ్డి, కేకే చూస్తారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని అధిష్టానానికి పీస్ కమిటీ ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. దీనిపై తమ పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వ విధానం ప్రకటిస్తామన్నారు.

**నేనే సీఎం అయిన రోజే కేసీఆర్ గుండె పగిలింది!**

తాను సీఎం అయిన రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక అనర్థాలకు కేసీఆరే కారణమన్నారు. దానికి ఆయనే బాధ్యత వహించాలన్నారు. పదేండ్లు సీఎంగా ఉండి రాష్ట్ర ఖజానా అంతా ఖాళీ చేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరంటూ వ్యాఖ్యానించారు. వరంగల్ సభలో కేసీఆర్ అదే అభద్రతాభావంలో మాట్లాడారన్నారు. ఆయన ప్రసంగంలో స్పష్టత లేదన్నారు. ఆయన స్పీచ్ అంతా అక్కసుతో నిండి ఉందని విమర్శించారు. కేటీఆర్ పై కేసు అయినా.. ఫోన్ ట్యాపింగ్ కేసు అయినా.. అన్నీ చట్ట పరిధిలోనే జరుగుతాయని వివరణ ఇచ్చారు. తాను మాత్రం కక్ష సాధింపు చర్యలకు దగనని సీఎం స్పష్టం చేశారు. కేసీఆర్ లా తాను చట్టాన్ని అతిక్రమించి అరెస్టు చేయించనని చెప్పారు. కేసీఆర్ సభకు ఎన్ని బస్సులు అడిగితే అన్ని ఇచ్చామన్నారు. దాంతో ఆర్టీసికి కూడా ఆదాయం వచ్చిందన్నారు. గతంలో బీఆర్ఎస్ హయంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వమంటే ఇవ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అవసరాలకు అనుగణంగా కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారని మండిపడ్డారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలని, రెండు దేశాలను ఓడించిన ఘనత ఇందిరాగాంధీదేనన్నారు. రాహుల్‌గాంధీకి, తనకు గ్యాప్ ఉందంటూ జరుగుతోన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. రాహుల్‌గాంధీ, తాను రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్నామని చెప్పారు. ఆ విషయం బయటకు చెప్పాల్సిన అవసరం తనకు లేదంటూ సీఎం పేర్కొన్నారు. కేసీఆర్, ప్రధాని మోడీ అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారని ఆరోపించారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. కేసీఆర్ విమర్శలు ఇప్పుడు కాదు.. అసెంబ్లీకి వచ్చి చేయాలన్నారు. తాను ఇంకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని సీఎం స్పష్టం చేశారు.

# బాధిత మహిళలకు అండగా జాతీయ కమిషన్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** వివిధ సమస్యలు.. కేసులతో సతమతమవుతోన్న బాధిత మహిళలకు అండగా నిలుస్తామని జాతీయ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ విజయ రహత్కర్ భరోసా ఇచ్చారు. సోమవారం హైదరాబాద్ టూరిజం ప్లాజా సమగం హాల్ లో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయి (బహిరంగ విచారణ) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పెండింగ్ లో ఉన్న 30 కేసులను పరిష్కరించి బాధిత మహిళలకు న్యాయం చేశారు. ఈ సందర్భంగా విజయ రహత్కర్.. మాట్లాడుతూ హైదరాబాద్ లో ఏర్పాటు చేసి మహిళా బాధితుల నుండి 60 వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ఆయా ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమన్నారు. కమిషన్ దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి బాధిత మహిళల నుండి వేల సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని తెలిపారు. కమిషన్ ముఖ్య ఉద్దేశం మహిళలు పడుతున్న బాధలు, కష్టాలు బాధితుల యొక్క సమస్యల సత్వరం పరిష్కారం కోసం కమిషన్ నేరుగా బాధితుల వద్దకే వస్తోందన్నారు. మహిళల గృహహింస కేసులు, సైబర్ నేరాలు, ఆన్లైన్ హారాష్మెంట్ కేసులు, చైల్డ్ కస్టడీ కేసులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలతో పాటు ఇతర కేసులు కూడా కమిషన్ దృష్టికి వచ్చాయని తెలిపారు.హైదరాబాద్ పరిధి లో 2022 నుంచి 2024 వరకు ఉన్న కేసుల్లో 30 కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేశామన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఎక్కడ కూడా అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపకుండా మహిళా కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. అన్ని రాష్ట్రాల్లో నెలలో నెలకు నాలుగు సార్లు కమిషన్ బాధిత మహిళల వద్దకు వెళ్లి సత్వర న్యాయం చేసి అండగా నిలుస్తోందన్నారు. పెండింగ్ కేసుల అంశాలను నివేదిక రూపంలో సత్వరమే అందించాలని పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ శారద నేరెళ్ల, మహిళా సంక్షేమ శాఖ సంచాలకులు క్రాంతి వెస్లీ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ క్రైమ్స్ విశ్వ ప్రసాద్, అదనపు కలెక్టర్ జి. ముకుంద రెడ్డి, డీసీసీ లావణ్య, హైదరాబాద్ జిల్లా మహిళా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, వయోవృద్ధుల శాఖ అధికారి రాజేందర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, బాధిత మహిళా కుటుంబాలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# భూ భారతి చట్టంతో రైతులకు మేలు

## కలెక్టర్ సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం మేడిపల్లి మండలం లో రైతు వేదిక నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పారదర్శకత జవాబు దారీతనంతో పని చేసేలా ఈ చట్టాన్ని రూపొందించిందని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం అధికారులు అందించిన ఆర్డర్ల పై సంతృప్తి చెందకుంటే బాధితులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణీత గడువు 30 రోజుల లోగా మ్యూటేషన్ పూర్తి చేయకుంటే ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్ రెడ్డి, మేడిపల్లి మండల్ తహసీల్దార్ వసంత ఎంపీడీవో. రైతులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి 3
మంగళవారం 29.04.2025 General News

# సింగరేణిలో ఉద్యమంగా జల వనరుల సంరక్షణ

## సీఎండీ బలరామ్

- నీటి బిందువు జల సింధువును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- సింగరేణిలో వ్యాప్తంగా నీటి బిందువు జలసింధువు ముమ్మరం
- 102 చెరువుల నిర్మాణం, పూడిక తొలగింపు
- ఇప్పటికే 20 శాతం చెరువుల నిర్మాణాలు పూర్తి
- కనీస చెరువు వైశాల్యం ఒక హెక్టారు ఉండేలా చర్యలు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** సింగరేణి ఆధ్వర్యంలో జల వనరుల సంరక్షణ ఉద్యమంపెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఆ సంస్థ సీఎండీ బలరామ్ ప్రకటించారు. భూగర్భ జలాల పెంపుదల లక్ష్యంగా సింగరేణి పరిధిలో నీటి బిందువు జల సింధువు.. పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్ని ఏరియాల జనరల్ మెనేజర్లను ఆదేశించారు. ఈ నెల ప్రారంభించిన మినీ చెరువుల నిర్మాణం వేగవంతంగా సాగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేవారు. వచ్చే నెల 15 నాటికి సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40 చెరువుల్లో పూడిక తొలగింపు పూర్తి చేయాలని బలరామ్ ఆదేశించారు. హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్ని ఏరియాల జీఎంలకు, సంబంధిత పర్యావరణ, సివిల్ శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికి 20 శాతం పైగా పనులు పూర్తయ్యాయని చెప్పారు. పనులను మరింత వేగిర పరుస్తూ వచ్చే నెల 15 నాటికి మొత్తం చెరువుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో సింగరేణి నిర్మించిన ఈ చెరువుల్లో నీరు పుష్కలంగా చేరే విధంగా సివిల్ పనులు పూర్తి చేయాలన్నారు. రక్షణ చర్యలుగా మినీ చెరువుల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. సింగరేణి సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు పెంచడం కోసం తీసుకున్న ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రతి ఏరియా జీఎం ప్రత్యేక శ్రద్ధతో విజయవంతం చేయాలని సూచించారు. తొలుత 50 మినీ చెరువులు నిర్మించాలని భావించినప్పటికీ, గనుల ప్రాంతంలో ఉన్న అవకాశాలను పరిగణలోకి తీసుకొని వీటి సంఖ్యను 62కు పెంచామన్నారు. అలాగే ఇప్పటికే ఉన్న 40 చెరువుల్లో నీటి సామర్థ్యం పెంపుదలకు పూడిక తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సింగరేణిలో గతంలో కేవలం అక్కడక్కడ చెరువుల పూడికను కొన్ని ఏరియాలో తీసిన దాఖలాలు ఉన్నాయన్నారు. కానీ ఈ విధంగా పెద్ద ఎత్తున చెరువుల నిర్మాణాన్ని చేపట్టడం గతంలో ఎన్నడూ జరగలేదని చెప్పారు. ఈ చెరువుల నిర్మాణం సింగరేణి సమీప ప్రాంత భూగర్భ జలాల పెంపుదలకు ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉందన్నారు.

**ఏరియాల వారీగా సింగరేణి కొత్తగా చేపడుతున్న 62 మినీ చెరువుల వివరాలు**

మందమర్రి లో 10 మినీ చెరువులు, కొత్తగూడెం లో 8, భూపాలపల్లిలో, రామగుండం 1లో, రామగుండం 2లో, ఇల్లందు, మణుగూరు, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఏరియాకు 5 మినీ చెరువుల చొప్పున, రామగుండం 3 ఏరియాలో 4 మినీ చెరువులను సింగరేణి యాజమాన్యం నిర్మిస్తోంది. ఈ సమీక్షలో కొత్తగూడెం కార్పోరేట్ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, పా కొప్పుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ కార్యాలయం నుంచి సింగరేణి అటవీ శాఖ అడ్వైజర్ మోహన్ పరిగిన్, పర్యావరణ శాఖ జనరల్ మేనేజర్ సైదులు, ఏరియాల నుండి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, పర్యావరణ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గీసుకొండలో శాంతి ర్యాలీ

**కలంజ్యోతి, గీసుకొండ :** పహాల్గం మృతులకు తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నివాళులర్పించింది. మండలంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒద్యారపు శంకర్ ఆధ్వర్యంలో మండలంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిరంవహిచారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఎండి అలీ, రాష్ట్ర ఆర్గనైజర్ సింగరపు రాజకుమార్, రాష్ట్ర ఆర్గనైజర్ చెంచు రాజయ్య, రాష్ట్ర సెక్రటరీ కుమ్మరి కుంట్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు కనకచారీ, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లయ్య, రఫీ, దయాకర్, లావణ్య, రాజు, అక్బర్, సాంబయ్య, మంద రమారాణి, సంతోష, సారంగపాణి, ఎల్లమ్మ, ముత్తయ్య, శ్రీను, అగ్బర్, సిబ్బంది పాల్గొన్నారు.





# ఎంసీఆర్హెచ్ఆర్డీ వైస్ ఛైర్మన్‌గా శాంతి కుమారి

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఈ నెల 30న పదవి విరమణ పొందుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి కాంగ్రెస్ సర్కార్ తీపి కబురు చెప్పింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్ హెచ్ఆర్డీ) వైస్ ఛైర్ పర్సన్ గా శాంతి కుమారికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎస్ పదవి విరమణ తర్వాత.. ఆమె ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ ఛైర్ పర్సన్ పోస్టుతో పాటు డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.



# నాణ్యమైన ధాన్యాన్ని తరలించాలి

## కలెక్టర్ బి సత్యప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల :** యాసంగి పంటలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామం మరియు కాచారం గ్రామం ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జివాకర్ రెడ్డి, తహసీల్దార్ వసంత సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డుకు మర్మమతులు చేయించాలి

**కలంజ్యోతి, నర్సాపూర్ :** సాదులనగర్ నుంచి చందాపూర్ కి వెళ్లే రహదారి తీవ్ర గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి కొండ సురేఖకు ఆయా గ్రామాల నాయ కులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మా ట్లాడుతూ అతి తొందరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

4 కలంజ్యోతి
మంగళవారం 29.04.2025 General News

## రాజీవ్ యువవికాసం పథకంలో జర్నలిస్టులకు రుణాలు కేటాయించాలి

### ఆల్ డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్‌రావు



**కలంజ్యోతి, మంచిర్యాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి జీత భత్యాలు లేకుండా నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిస్వార్థంగా సేవ చేస్తున్న జర్నలిస్టులకు ప్రత్యేకంగా రుణాలను కేటాయించాలని ఆల్ డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే గొప్ప ఉద్దేశం తో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఉన్నత చదువులు చదివి జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రత్యేక అవకాశం కల్పించినట్లైతే వారిని ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహించినట్టు అవుతుందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్టుల జీవితాలు మారలేదన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం లో రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టుల కు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



## జాతీయ మానవ హక్కుల కమిటీ జగిత్యాల జిల్లా ప్రచార కార్యదర్శిగా సామల

**కలంజ్యోతి, మల్యాల :** జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ఆర్ సీ) జగిత్యాల జిల్లా ప్రచార కార్యదర్శిగా మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన సామల లక్ష్మీనారాయణను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా భారత రాజ్యాంగ చట్టాలను అనుసరించి అవినీతి, అక్రమాలకు తావులేని సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎన్ హెచ్ఆర్ సీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, అధికార ప్రతినిధి కోలా రాజేశంగౌడ్, జగిత్యాల రూరల్ ప్రధాన కార్యదర్శి మ్యాన మధు, బీర్పూర్ మండల అధ్యక్షుడు చిర్నెని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గంగాధరి పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీ కొని యువకుడు మృతి



**కలంజ్యోతి, మల్యాల :** మండలం రాజారం ప్రధాన రహదారిపై లారీ ఢీ కొని ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ కుమార్ కథనం మేరకు.. రాంపూర్ గ్రామానికి చెందిన అల్లేపు నరేష్ (18), బొదాసు రాజ్ కుమార్ (18) ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి వస్తుండగా రాజారం వద్ద ఓ లారీ వెనకాల నుండి ఢీ కొట్టింది. దాంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, వెంటనే స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

# కేసీఆర్ శకం ముగిసింది

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ఫస్ట్ అండ్ లాస్ట్ విలన్ కేసీఆరేనని విమర్శించారు. సోమవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27 వరంగల్ లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయని అసలు ఆ సభలో అసలు మహిళలే కనిపించలేదని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగంలో పసలేదని చురకలంటించారు. కాంగ్రెస్ భిక్షతోనే కేసీఆర్ సీఎం అయ్యారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి కేసీఆర్ కి గుండెల్లో గుబులు మొదలైందన్నారు. 420 హామీలంటూ విమర్శిస్తున్న కేసీఆర్ మీ పదేళ్ల బిఆర్ఎస్ పాలన 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమయం, వేదిక మీరే డిసైడ్ చేయండి చర్చకు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని మహేశ్ కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు. అసలు ఫాం హౌస్ దాటి వచ్చే దమ్ము కేసీఆర్ కు ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్ కుటుంబం రైజింగ్ అయిందని ఆరోపించారు. జన్వాడలో ఉన్న ఫాం హౌస్ లు ఎవరివని ప్రశ్నించారు. కేసీఆర్ అరాచక పాలనను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కేసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అన్నారు. దీనికి కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గాంధీ కుటుంబం పెట్టిన రాజకీయ భిక్షతో దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తారని ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత ఆడుతున్న మూడు ముక్క లాటతో కేసీఆర్ కు మతి భ్రమించిందని కుటుంబ కొట్లాట వేగలేక రజతోత్సవ సభ పేరిట కేసీఆర్ హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వేదికపై అయ్య కేసీఆర్, కొడుకు కేటీఆర్ ఫ్లెక్సీ తో అల్లుడు హరీష్, కూతురు కవిత మనసుకి మరోసారి గాయమైందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కేసిఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్ గా మారింది. బీజేపీబీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అనడానికి నిదర్శనం బీజేపీపై కేసీఆర్ రెండు నిమిషాల ప్రసంగం అని ఎద్దేవా చేశారు. బీజేపీపై కేసీఆర్ విమర్శలు నెమలి పించ్చంతో కొట్టినట్లు ఉందన్నారు. కేసీఆర్ ప్రసంగంతో బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని మరోసారి రుజువైందన్నారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసీఆర్ ఎందుకు నోరు మెదపలేదన్నారు. బీజేపి,బీఆర్ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నాయన్నారు.

## భూకబ్జాపై విచారణ జరిపించాలి

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని ముత్యంపేట గ్రామ పరిధిలో కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన 'సులభ్ కాంప్లెక్స్' పరిధిలోని భూ కబ్జాకు గురైందన్న అనుమానాలు తెరపైకి వచ్చాయి. సర్వే నంబర్ 380/బీ గల ఈ భూమి ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం కేటాయించ బడినదిగా గుర్తించబడింది. అయితే, కొంతమంది వ్యక్తులు ఈ భూమిని తమ వ్యక్తిగత ఆస్తిగా ప్రకటించి అక్రమంగా ఆక్రమిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాసా రపు శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. భూమిపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ కబ్జా జరిగిందని తెలితే ఆ భూమి ని ఆలయ అభివృద్ధి కోసం కేటాయించాలంటూ సోమవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలన అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎండీ అఖిమ్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థులు, భక్తులు ఈ భూమి ఆలయానికి సంబంధించినదని, ఇది ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఉపయోగపడే ప్రదేశమని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కోలా రాజేశం గౌడ్, జగిత్యాల రూరల్ ప్రధాన కార్యదర్శి మ్యాన మధు, బీర్పూర్ మండల అధ్యక్షుడు చిర్నెని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గందరి పూర్ణ చందర్ పాల్గొన్నారు.



## ఉద్యోగులకే కుచ్చుటోపీ పెట్టిన నందా ఫుడ్స్

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ లో నందా ఫుడ్స్ పేరు మోసిన కంపెనీ. రంగారెడ్డి నగర్ లో గత 20 సంవత్సరాలుగా తన దగ్గర పనిచేస్తున్న ఉద్యోగులకి ఈపీఎఫ్ కడుతున్నామని చెప్పి, వారి జీతాలను కట్ చేసింది. ఇప్పుడు ఈపీఎఫ్ కోసం అప్లై చేసుకుంటే ఎవరికీ ఈపీఎఫ్ అమౌంట్ రావట్లేదు. ఏంటా అని ఆరా తీస్తే ఎన్నో అవకతవకలు జరగాయని తెలుస్తుంది. ఈ క్రమంలో నందా ఫుడ్స్ కంపెనీలో నిర్వహించిన ఉమ్మడి జన సమన్వయ కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ సయ్యద్ జిశాన్ అహ్మద్ ని కలిసి నందా ఫుడ్స్ కంపెనీ బాధితులు తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఈ విషయమై విలేకరులు అడగగా బాధితులకు అండగా ఉంటానని వారి పీఎఫ్ అమౌంట్ అతి త్వరలో వారికి వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య కాక, బాలకృష్ణ, గురువారెడ్డి, శ్యామ్, ఈఎస్ఐ పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణ స్వీకారం

## ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**కలంజ్యోతి, హైదరాబాద్ :** లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డి, ఉపలోకాయుక్తగా బి.ఎస్.జగ్జీవన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డి , బి.ఎస్.జగ్జీవన్ కుమార్లు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హాజరైన వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి నియామకం రాష్ట్ర పాలనలో మరింత పారదర్శకత , జవాబుదారీతనాన్ని పెంచుతుంద ని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఓ ముఖ్యఘట్టంగా పరిగణించబడుతుంది. లోకాయుక్త, ఉపలోకా యుక్తల నియామకంతో ప్రజలు తమ సమస్య లను, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించే ఒక ఉన్నత స్థాయి వేదికగా అందరూ భావిస్తున్నారు.

---

# ఘనంగా పోచమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



**కలంజ్యోతి, నర్సాపూర్ :** నియోజకవర్గంలోని హత్నూర మండల పరిధిలోని కాసాల 12 వార్డులో పోచమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మాణిక్ పంతులు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం అనంతరం పుణ్య దంపతులచే హోమం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాగులగడ్డ శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణగౌడ్, ఆశిరెడ్డి, కిష్టారెడ్డి, బక్క రవి, నాయికోటి ప్రభాకర్, లక్ష్మీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి, (సన్నీ) పార్థివరెడ్డి మల్లయ్య, నరసింహారెడ్డి, కొండగౌడ్, రాజ మల్లయ్య, భుజంగరెడ్డి, అనంతరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా లింగమంతుల స్వామి, గంగదేవమ్మ జాతర



**కలంజ్యోతి, నాగారం :** నాగారం మండలం వర్ధమానుకోట పస్తాల గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీలింగమంతుల స్వామి, గంగాదేవి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. యాదవులు భేరీలు కొడుతూ కాళ్లకు గజ్జలు కట్టుకొని నృత్యాలు చేయగా మహిళలు బోనాలను అందంగా అలంకరించి సౌనమ్మ, మల్లన్న, గంగమ్మ దేవతలకు సమర్పించి మొక్కలు కొబ్బరికాయలు , బోనాలు యాటపోతుల చెల్లింపు కార్యక్రమం అంగరంగ వైభోపేతంగా నిర్వహించారు. యాదవులు చేసిన కటారి విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యాదవ సోదరులు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

---




# లేబర్ కోడ్ రద్దుకోసం మే 20న దేశవ్యాప్త సమ్మె

**కలంజ్యోతి, నిర్మల్ :** కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్ రద్దు కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో కార్మిక సంఘాల జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ క్రమంలో వక్తలు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్ లుగా అమలు చేయాలని బీజేపీ మోదీ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మే నెల 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జిల్లాలోని అన్ని రంగాల ఉద్యోగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, నేత బొమ్మెన సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసచారి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఎం బక్కన్న, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి హరిత, ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి విలాస్ తదితరులు పాల్గొన్నారు.

---



## ఇసుక రీచ్ లో హద్దులు ఏర్పాటు చేసిన

# రెవెన్యూ అధికారులు

**కలంజ్యోతి, నాగారం :** నాగారం మండల పరిధిలోని పేరబోయినగూడెం రెవెన్యూ శివారులో బిక్కేరు వాగులులో 'మన ఇసుక -మన పాలసీ'లో హద్దులు దాటి ఇసుకను తోడుతున్నారని శనివారం 'అనుమతులో ఒకచోట.. ఎత్తేది మరోచోట' అనే కథనం వార్తాపత్రికల్లో వచ్చాయి. దీంతోస్థానిక తహసీల్దార్ బ్రహ్మయ్య డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రకాష్ ఆధ్వర్యంలో సోమవారం భిక్కేరు వాగులో సర్వే చేపట్టారు. జాజిరెడ్డిగూడెం నాగారం మండలాల మధ్య హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విచారణలో హద్దులు దాటి ఇసుక ఎత్తినట్లుగా నిర్ధారణ అయిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులు వాదోపవాదాలకు దిగినట్లుగా సమాచారం. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి హద్దులు దాటి ఇసుక తోడుతున్న వారిని అక్కడ నుండి పంపించేశారు. ఇసుక రీచ్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఆర్వో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే హద్దులు దాటి ఇసుకను ఎత్తారని రైతులు ఆరోపిస్తున్నారు. హద్దుల ఏర్పాటు సరే నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన ఎస్ఆర్ఓపై చర్యలు ఏవని రైతుల ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 'మన ఇసుక -మన పాలసీ' ద్వారా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఇసుక రవాణా జరగాలి.. కానీ ఎస్ఆర్ఓ నిర్లక్ష్యంతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా జరగడం గమనార్హం. జిల్లా అధికార స్పందించి ప్రభుత్వ లక్ష్యాన్ని పటిష్టం చేయాలని రైతుల కోరుతున్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ అల్లావుద్దీన్, సర్వేయర్ సాయి కృష్ణ, సిబ్బంది ఉన్నారు.



### కొండగట్టు అంజన్నను దర్శించుకున్న

## భద్రాది ఆలయ ఈవో

**కలంజ్యోతి, మల్యాల :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్నను భద్రాది ఆలయ ఈవో రమాదేవి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుంకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని సత్కరించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతితో భద్రత

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**కలంజ్యోతి, అశ్వారావుపేట :** ఆనాటి ధరణి తో రైతులకు ఏర్పడిన కష్టాలకు ఈనాటి భూభారతితో రైతులకు సుఖాలు చేకూరుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట లో సోమవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ గిరిజన ప్రాంతంలో గిరిజనులు గిరిజనేతరులు తరతరాలుగా అన్నదమ్ములుగా, అక్క చెల్లెలుగా జీవిస్తున్న ఈ ప్రాంతంలో ధరణి వచ్చి వారిని శత్రువులను చేసిందన్నారు. ఆ చట్టంలో లొసుగులు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు, కష్టాలు పడ్డారన్నారు. ధరణీ అక్రమాలను అర్థం చేసుకున్న ప్రజలు, రైతులు గత ఎన్నికల్లో బీఆర్ఎస్ కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదవాడి కన్నీరు తుడిచే విధంగా ప్రజలందరికీ ఉపయోగపడే నిజమైన చట్టాన్ని ఈ భూభారతిని అంబేద్కర్ జయంతి దినానా ప్రజలకు అంకితం చేశామన్నారు. గత ప్రభుత్వం దొరవారి కుటుంబ సభ్యులు, అనుచరులకు ఉపయోగపడే విధంగా అర్ధరాత్రి ధరణి చట్టాన్ని రూపొందించింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ తరతరాలుగా తాతలు, ముత్తాతలు నుంచి ఏ భూమి నైతే సాగు చేసుకుంటూ ఉన్న భూమి ధరణి కారణంగా పాసుబుక్ లో నమోదు కాకపోతే కార్డు కార్డులో ఎక్కిస్తుందన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగానే ఎమ్మార్వో, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిల్లో పరిష్కరించడానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. గత ప్రభుత్వం రైతు బంధు కోసం ధరణి చట్టం తీసుకువచ్చిందన్నారు. అంతే తప్ప ధరణిలో దరఖాస్తు చేసుకున్న 9.26లక్షల దరఖాస్తులకు ఎటువంటి పరిష్కారం చూపలేదు అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 5.45లక్షల దరఖాస్తులను పరిష్కరించినట్లు మంత్రి తెలిపారు. సమస్యల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా తహసీల్దార్లు ప్రతి గ్రామంలో రెవెన్యూ సభలు నిర్వహించడం ద్వారా దరఖాస్తులను సేకరించి వాటిని పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో వచ్చిన దరఖాస్తులను జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పరిష్కారాలు చూపుతామన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా మే రెండవ తేదీ నుండి హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరిస్తామన్నారు. గతంలో భూ సర్వే చేయాలంటే మూడు నుంచి నాలుగు నెలలు పట్టేదని మంత్రి తెలిపారు. రైతులకు ఇబ్బంది తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇచ్చిన ప్రైవేట్ లైసెన్సు ఉన్న సర్వేయర్లతో త్వరలోనే భూ సర్వే చేపడతామన్నారు. గత ప్రభుత్వం వారి స్వప్రయోజన కోసం వీఆర్ఏ,వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిందని, వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి రాష్ట్రవ్యాప్తంగా 10956 రెవెన్యూ గ్రామాల్లో ఈ ఇందిరమ్మ ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ అధికారులను నియమిస్తుందని అన్నారు.

# భూ భారతి దేశానికే రోల్ మోడల్

### మంత్రి కొండా సురేఖ



**కలంజ్యోతి, నర్సాపూర్ :** తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం హత్నూర మండలం లోని దౌల్తాబాద్ ఎస్ ఎస్ సార్ ప్రైవేట్ ఫంక్షనల్లో భూభారతి అవగాహన సదస్సుకు, అటవీ, దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలిసి పాల్గొన్నారు. దేశంలో తీవ్రవాదుల దాడికి నిరసనగా రెండు నిమిషాల సమయం మౌనం పాటించారు. జ్యోతి ప్రజ్వలన చేసి భూ భారతి చట్టం అవగాహన సదస్సును ప్రారంభించారు. అనంతరం భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగామంత్రిమట్లాడుతూ.. దేశంలో తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఎంపీ రఘునందన్ రావుకు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చామని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. భూ భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి చట్టం అని ఈ చట్టం లో హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ, పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం అవకాశం ఉందన్నారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయాలని, భూమి హక్కులు మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదుకు, పాసు పుస్తకాలలో భూమి పటం ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. భూ సమస్యల పరిష్కారనికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, వ్యక్తికి ఆధార్ భూమికి భూధార్ కార్డుల జారీ చేస్తున్నట్లు చట్టంలో ఉందని తెలిపారు. ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం ,గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వర్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారన్నీ కూడా పొందుపరిచారని, రికార్డులో తప్పుల సవరణకు ,హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా అవకాశం ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, తహసిల్దార్ పర్వీన్ షేక్, తెలంగాణ రాష్ట్ర టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజి రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు బోనాలు

**కలంజ్యోతి, ఆందోల్ :** సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో అందర్నీ చల్లంగా చూడాలంటూ గ్రామ దేవతలకు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. స్థానిక మహిళలంతా కలిసి గ్రామంలోని ఎల్లమ్మగుడి వద్దకు బోనాలను ఎంతో అత్యంత వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో శివసత్తుల ఆటలు, పోతురాజుల విన్యాసాలు అలరించాయి. ఆలయంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు అందర్నీ చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. అలాగే గ్రామస్తులంతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. సాయంకాల సమయంలో ఈ బోనాల జాతర నిర్వహించడంతో గ్రామమంతా చీకటిలో దీప కాంతులతో శోభయమానంగా కనిపించింది.





# ఎన్నిసార్లు విఫలమయ్యానో!

హీరోయిన్ శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. తాజాగా ఈ బ్యూటీ తను విఫలమైన సంబంధాల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. 'అందరికీ ప్రమాదకరమైన పాస్ట్ లవ్ స్టోరీ ఉంటుంది. కానీ నేను ఎలాంటి బాధకు లోనవ్వకుండా.. ఆ గతాన్ని మర్చిపోయాను'. రిలేషన్ షిప్ బ్రేక్ అయినప్పుడు ప్రజలు ఆమెను తరచుగా ఎలా అంచనా వేస్తారనే దాని గురించి మాట్లాడుతూ..'ఇది ఏ బాయ్‌ఫ్రెండ్ నంబర్?' అని ప్రజలు అడిగినప్పుడు, వారికి అది ఒక సంఖ్య అని వారు అర్థం చేసుకోరు. నేను కోరుకున్న ప్రేమను పొందడంలో నేను ఎన్నిసార్లు విఫలమయ్యానో. నేను నా భాగస్వాములను నిందించను ఎందుకంటే మేము ఒకే సమయంలో ఒకే విధంగా మారడానికి సిద్ధంగా లేము. అది సాధ్యం కాదు. కాబట్టి, నేను దాని గురించి చెడుగా భావించడం లేదు. కానీ నేను కొంచెం చెడుగా భావిస్తున్నాను. వాస్తవానికి, నేను మనిషిని." అని వెల్లడించింది. తన సంబంధాలు తనకు అతిపెద్ద జీవిత పాఠాలు అని శ్రుతి హాసన్ అంగీకరించింది. ఆమె విజయం చూసి ఆమె భాగస్వాములు భయపడుతున్నారా అని అడగ్గా.. ఆమె 'లేదు, నేను అలా అనుకోను. నా వ్యక్తిగత జీవితంలో నేను అలా అస్సలు ఆలోచించను' అని శృతి హాసన్ చెప్పింది. ప్రస్తుతం ఈ హీరోయిన్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

